
సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం । 28 । మార్చి । 2023



అశ్వవాహనంపై విహారింపు

వేములవాడ: రాజన్న సన్నిధిలో జరుగుతున్న సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారిని అశ్వ వాహనంపై ఊరేగించారు.



అత్యాశకు పోతే అంతే..

సైబర్ నేరగాళ్లు సాఫ్ట్‌గా మాట్లాడి ఆర్థికంగా మోసం చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచనలు చేస్తున్నా.. పెడచెవిన పెట్టినవారు మోసపోతున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
37.0/20.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. పగటిపూట ఎండ తీవ్రంగా ఉంటుంది.

కూలీలతో పని చేయించుకున్నప్పుడు వారి చెమట ఆరకముందే కష్టార్జితం చెల్లించాలి
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
మంగళ 6.32	బుధ 4.48

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

రేపు మినీ జాబ్ మేళా

సిరిసిల్లకల్చరల్: ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన నిరుద్యోగులకు మినీ జాబ్ మేళాను బుధవారం నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ ఉత్తీర్ణులైన యువతీ యువకులు నర్సింగ్ కళాశాల సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో ఈ నెల 29న విద్యార్హతల ధ్రువపత్రాలతో నేరుగా హాజరుకావాలని సూచించారు. ఎంపికైన వారికి ప్రతి నెలా రూ.10 వేల నుంచి 20వేల వేతనం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల వారు నేరుగా ఉదయం 11గంటలకు మేళాకు హాజరు కావాలని, పూర్తి వివరాలకు 99633 57250 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్ష్మణ్



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా కోడి లక్ష్మణ్ ఎన్నికయ్యారు. సోమవారం అసోసియేషన్ భవనంలో జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా సజ్జనం అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు వరద మారుతి, సంయుక్త కార్యదర్శి బాలసాని నాగరాజుగౌడ్, క్రీడల కార్యదర్శి గుడ్ల కిషన్, కోశాధికారి గోవర్ధన్‌రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి సురేశ్‌ప్రసాద్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి సురభి సత్యనారాయణ తదితరులు కొత్త కార్యవర్గాన్ని అభినందించారు.

వాహన పూజ షెడ్డు ప్రారంభం



గోశాల నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఈవో కృష్ణప్రసాద్

వేములవాడ: రాజన్నను భక్తులు దర్శించుకుని స్వామివారి సన్నిధిలో తమ వాహనాలకు పూజ చేయించుకునేందుకు అవస్థలు పడుతున్న క్రమంలో రూ.19 లక్షలతో నిర్మించిన షెడ్డును ఆలయ ఈవో కృష్ణప్రసాద్ సోమవారం ప్రారంభించారు. అలాగే శిథిలావస్థకు చేరిన రాజేశ్వరపురం వసతి గదులను కూల్చివేసేందుకు రూ.17 లక్షల పనులకు కూడా ప్రారంభించారు. గుడి చెరువులో రూ.90లక్షలతో శివార్చన వేదిన నిర్మాణం, రూ.66 లక్షలతో తిప్పాపూర్ గోశాలలో షెడ్డు నిర్మాణ పనులకు సైతం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, ఏఈ డి.శేఖర్, పర్యవేక్షకులు శ్రీరాములు, శివరాయి పాల్గొన్నారు.

డబుల్‌రోడ్డు కోసం అఖిలపక్షం పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న అఖిలపక్షం నాయకులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని కొత్తపల్లి ఎల్లమ్మ ఆలయం నుంచి కొత్తపల్లి మీదుగా సిద్దిపేట జిల్లా సరిహద్దు వరకు 3 కిలోమీటర్ల డబుల్ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్షం నాయకులు సోమవారం పాదయాత్ర నిర్వహించారు. సిద్దిపేట జిల్లా సరిహద్దు గ్రామం నుంచి దుబ్బాక వరకు డబుల్‌రోడ్డు ఉందని, కేవలం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎల్లమ్మ ఆలయం నుంచి జిల్లా సరిహద్దు వరకు రోడ్డు విస్తరణ పనులు చేయలేదన్నారు. ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని, పదిరోజుల్లో ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు గణేశ్, పర్శ గౌడ్, ఎలక రాజు, శ్రీనివాస్‌రెడ్డి, దమ్మ శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

మన పల్లెలే దిక్సూచి



జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

- ఉత్తమ పంచాయతీలకు ప్రశంసాపత్రాలు
- కేంద్రం సహకరిస్తే మరెంతో అభివృద్ధి
- రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరిస్తాం
- రెండు నెలల్లో మల్కపేట రిజర్వాయర్ పూర్తి
- రాష్ట్ర మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: మన పల్లెలే ఇప్పుడు దేశానికి దిక్సూచిలా మారాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. జిల్లాలోని ఉత్తమ గ్రామపంచాయతీలకు సోమవారం కలెక్టరేట్‌లో ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో 20 ఉత్తమ పంచాయతీలకు 19 మన రాష్ట్రంలోనే ఉన్నాయన్నారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలతో తెలంగాణ పల్లెలు దేశానికి ఆదర్శమయ్యాయన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు కేంద్రం సహకరించి నిధులిస్తే మరింత అభివృద్ధి పనులు జరిగేవని పేర్కొన్నారు. కొత్తపంచాయతీరాజ్ చట్టంతో పల్లెల రూపురేఖలు మారడంతో సామాజికంగా, ఆర్థికంగా పల్లెలు బాగుపడ్డాయని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితో ఇది సాధ్యమైందన్నారు. తొమ్మిది విభాగాల్లో జిల్లాలోని 27 ఉత్తమ గ్రామ పంచాయతీల సర్పంచులకు మంత్రి ప్రశంసాపత్రాలు, మెమోంటోలు అందించారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, డీపీవో రవీందర్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అంతకు ముందు మంత్రి కలెక్టరేట్‌లో శిశువుల సంరక్షణ కేంద్రం(క్రచ్)ను ప్రారంభించారు. క్రచ్ కేంద్రాన్ని మంచిగా నిర్వహించాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంను ఆదేశించారు. ట్రాన్స్‌జెండర్ జీవనోపాధి కోసం రూ.లక్ష చెక్కును మంత్రి పంపిణీ చేశారు. 'బలగం' సినిమా చూశానని, బాగుందని ఆ చిత్ర దర్శకుడు యెల్దండి వేణును మంత్రి సత్కరించారు. మరిన్ని మంచి సినిమాలు తీయాలని సూచించారు.



కార్యక్రమానికి హాజరైన సర్పంచ్‌లు

వచ్చే నెలలో ఆక్వా హబ్‌కు శంకుస్థాపన

మధ్యమానేరు బ్యాక్ వాటర్‌లో వచ్చే నెలలో ఆక్వా హబ్‌కు శంకుస్థాపన చేస్తామని మంత్రి వెల్లడించారు. నెహ్రూనగర్ అంబాభవాని ఆలయం వద్ద జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రెడ్డిమల్ల హన్మాండ్లుతో మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. తూకం వేసి సరుకులు అందించేలా చూస్తామని, గౌరవ వేతనం విషయంలో సీఎంతో మాట్లాడుతానని మంత్రి పేర్కొన్నారు. మరో రెండు నెలల్లో కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వార్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని రమేశ్, జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యకర్తలతో రోజంతా గడపండి..

బీఆర్‌ఎస్ కార్యకర్తలతో రోజంతా గడపాలని మంత్రి పార్టీ శ్రేణులను ఆదేశించారు. పద్మనాయక కల్యాణ మండపంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. పది గ్రామాలకు ఒక్క యూనిట్‌గా సమావేశాలు నిర్వహించి సీఎం కేసీఆర్ సందేశాన్ని వినిపించాలన్నారు. కార్యకర్తలతో ఆత్మీయంగా ఉండాలని, ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, ఎమ్మెల్సీలు ఎల్.రమణ, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, చెన్నమనేని రమేశ్‌బాబు, సుంకె రవిశంకర్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, దాసోజు శ్రవణ్, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళాచక్రపాణి, రామతీర్థం మాధవి, గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఆర్‌బీఎస్ చైర్మన్ గడ్డం నర్సయ్య, జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ.. వినతుల స్వీకరణ

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల టూ కాకినాడ, సిరిసిల్ల టూ వరంగల్‌కు నడిపే రెండు కొత్త సూపర్ లగ్జరీ, రెండు డీలక్స్ బస్సులను సోమవారం మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన నిరుద్యోగి చిటికెన నవీన్ కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. కాగా సిరిసిల్ల బీవైనగర్ పర్యటనలో మంత్రి కేటీఆర్‌కు ప్రజల నుంచి విన్నపాలు వెల్లువెత్తాయి. నలభై ఏళ్ల క్రితం దళితులకు అప్పటి ప్రభుత్వం కట్టించిన ఇండ్లు శిథిలమై పోగా.. ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, వాటి స్థానంలో డబుల్‌బెడ్రూం ఇండ్లు ఇప్పించాలని అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆకునూరి బాలరాజు, సిరిగిరి మురళి తదితరులు మంత్రికి విన్నవించారు.

కాన్వాయ్‌ని అడ్డుకున్న ఏబీవీపీ

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌ను నిరసిస్తూ ఏబీవీపీ నాయకులు సోమవారం సిరిసిల్లలో మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. పాతబస్టాండు ప్రాంతంలోని సంజీవయ్యనగర్ కమాన్ ప్రాంతంలో పలువురు విద్యార్థులు పోలీసుల కళ్లుగప్పి కాన్వాయ్ ముందుకు జెండాలతో వచ్చి అడ్డుకున్నారు. విద్యార్థి నాయకులు మారవేని రంజిత్, అక్కెం నాగరాజు తదితరులను పోలీసులు బలవంతంగా ఈడ్చేశారు.

కాళేశ్వర జలాలకు పూజలు



పూజలు చేస్తున్న మంత్రి కేటీఆర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల గ్రామ శివారులో రంగనాయక సాగర్ ప్రాజెక్టు కాలువల ద్వారా జిల్లాకు చేరిన కాళేశ్వర జలాలకు మంత్రి కేటీఆర్ సోమవారం సాయంత్రం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్ల మధు, ఎంపీపీ మానస, జెడ్పీటీసీ మంజులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైస్‌మిల్ యూనిట్ ఆదర్శం కావాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): దళితబంధులో భాగంగా దుమాలలో ఏర్పాటు చేసిన రైస్‌మిల్ యూనిట్ అందరికీ ఆదర్శం కావాలని మంత్రి కేటీఆర్ అన్నారు. మండలంలోని పదిరకు చెందిన ముగ్గురికి దళితబంధు కింద ఒక్కొక్కరికి రూ.10లక్షల చొప్పున రూ.30 లక్షలు మంజూరు కాగా, యూనిట్‌గా ఏర్పడి దుమాలలో ఏర్పాటు చేసుకున్న రైస్‌మిల్‌ను సోమవారం మంత్రి ప్రారంభించారు. దళిత బంధు పథకం వివరాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. దళిత బంధు లబ్ధిదారులు రైస్‌మిల్ యూనిట్‌ను స్థాపించుకోవడం గొప్ప నిర్ణయమన్నారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో దళితుల కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయడం జరుగుతుందన్నారు. పథకాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జెడ్పీచైర్ పర్సన్ అరుణ తదితరులు పాల్గొన్నారు.



రైస్‌మిల్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి, తదితరులు

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



సిరిసిల్లఎడ్యుకేషన్: పదో తరగతి విద్యార్థులకు త్వరలో జరిగే పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, గతేదాదితో పోల్చితే ఈ విద్యాసం వత్సరం మంచి ఫలితాలు సాధిస్తారని జిల్లా విద్యాధికారి రమేశ్ తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ జరిగిందని, ఉపాధ్యాయులు అంతర్గత పరీక్షలు నిర్వహించారని పేర్కొన్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని వివరించారు. గతేదాది పది ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో ఏడో స్థానంలో ఉందని దానిని మూడు లేదా నాల్గో స్థానంలో నిలుపుతామని డీఈఓ రమేశ్ 'సాక్షి'తో పలు విషయాలు వెల్లడించారు.

- ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం
- మెరుగైన ఫలితాలు సాధిస్తాం
- సీసీ కెమెరాల మధ్య పేపర్లు ఓపెన్
- సమస్యాత్మక కేంద్రాలపై నిఘా
- 'సాక్షి'తో డీఈఓ రమేశ్

విద్యాసంవత్సరాల వారీగా పదో తరగతి ఫలితాలు (శాతం)

2016–17	87.3
2017–18	91.3
2018–19	97.7
2019–20	100 (కరోనా)
2020–21	100 (కరోనా)
2021–22	95.76

ఆందోళన వద్దు.. 'అభ్యసన' మేలు

పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలు అనగానే ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదు. గతానికంటే మెరుగైన సౌకర్యాలను ప్రభుత్వం విద్యార్థులకు అందించింది. వీటిలో భాగంగా విద్యార్థులకు ఉదయం, సాయంకాలం ప్రత్యేక తరగతులను నిర్వహించారు. వీరందరికీ అల్పాహారం అందించారు. అలాగే విద్యార్థులు అధిక మార్కులను స్కోర్ చేసే విధానంతోపాటు వెనకబడినవారు కనీస ఉత్తీర్ణత సాధించేందుకు వీలుగా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో అభ్యసన మెటీరియల్‌ను అందించారు. దీనిని చదవడం వల్ల 70 శాతం మార్కులు సాధించే అవకాశాలున్నాయి. దీనికి తోడు జిల్లాలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహించారు. ఇవన్నీ విద్యార్థులకు పరీక్షలంటే భయం ఉండకుండా మంచి గ్రేడ్ పాయింట్లు సాధించడానికి మార్గాలుగా చూడవచ్చు.

ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు..

జిల్లాలో పదో తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమవుతాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. జిల్లా వ్యాప్తంగా 6,496 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. జిల్లాలో మొత్తం 36 కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఒక్కో సెంటర్‌కు ఒక్కో చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటర్ ఆఫీసర్‌ను కేటాయించారు. రాష్ట్ర పరీక్ష విభాగం ఆదేశానుసారం ఫ్లయింగ్ స్క్వాడ్స్ అందుబాటులో ఉంటారు. పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ లేకుండా పకడ్బందీగా నిర్వహిస్తాం. 36 కేంద్రాల్లో ఐదింటిని సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించాం. ఆయా కేంద్రాల్లో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశాం. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాల నడుమ ప్రశ్న పత్రాల విడుదల ప్రక్రియ ఉంటుంది.

ఏప్రిల్ 3 నుంచి జరిగే పరీక్షల టైం టేబుల్

3న ఫస్ట్ లాంగ్వేజ్	8న మ్యాథ్స్
4న సెకండ్ ల్యాంగ్వేజ్	10న సైన్స్
6న ఇంగ్లిష్	11న సోషల్

ప్రజాగొంతుకలను నొక్కేస్తున్న బీజేపీ

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అవినీతిని నిలదీసినందుకు కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీపై అక్రమ కేసులు బనాయించారని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ విమర్శించారు. రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దును నిరసిస్తూ సోమవారం సిరిసిల్ల గాంధీచౌక్ ప్రాంతంలో నిరసన దీక్ష చేపట్టగా ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యలు ప్రశ్నిస్తున్నందుకే ప్రధాని మోదీ ప్రతిపక్షాల గొంతు నొక్కే చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల్లో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ.. నరేంద్రమోదీ సూరత్‌లో అక్రమ కేసు పెట్టించి రాజకీయ కుట్రతో రాహుల్‌ను పార్లమెంటు నుంచి బహిష్కరించడం శోచనీయమన్నారు. అక్రమ కేసులు, పార్లమెంటు సభ్యత్వంపై వేటు వేయడం రద్దు చేసేవరకు దేశవ్యాప్త ఆందోళనలు కొనసాగుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, జిల్లా అధ్యక్షురాలు కామని వనిత, పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, నాయకులు జలగం ప్రవీణ్, దొమ్మాటి నర్సయ్య, వకుళాభరణం శ్రీనివాస్, చొప్పదండి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కోనరావుపేట(వేములవాడ): వడగళ్ల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. మండలంలోని మరిమడ్లలో వడగండ్ల వర్షాలకు నష్టపోయిన పంటలను సోమవారం పరిశీలించారు. ఆరుగాలం శ్రమించి బోర్లపైనే ఆధారపడి సాగు చేసుకుంటున్న పంటలు ఏటా ప్రకృతి ప్రకోపానికి బలవుతున్నా ప్రభుత్వం మాత్రం స్పందించడంలేదన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, నాయకులు పుల్కం మల్లేశం, సింగం నారాయణ, రాజ మల్లేశం తదితరులు ఉన్నారు.

కొంచెం మోదం.. కొంచెం ఖేదం!

- ఎన్‌ఎంఆర్ వేతనాలు పెంచుతూ గెజిట్ జారీ
- రెండేళ్లకోసారి పెరుగుదల, తాజా సవరణతో 15శాతం పెంపు
- కరీంనగర్‌లో కనీస వేతనానికి దూరంగా కొందరు ఎన్‌ఎంఆర్‌లు
- రూ.425కు బదులుగా రోజుకు రూ.283 మాత్రమే చెల్లింపు
- సాక్షాత్తూ కరీంనగర్ కలెక్టరేట్ ప్రాంగణంలోనే అమలుకాని వైనం
- మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో సంతృప్తికరంగానే వేతనాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: నామినల్ మస్టర్ రోల్ (ఎన్‌ఎంఆర్)ల వేతనాలు పెంచుతూ కరీంనగర్ కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి రెండేళ్లకోసారి వీరి వేతనాలను సవరిస్తూ ఉంటారు. కానీ, కరోనా కారణంగా 2020లో వీరికి వేతన సవరణ జరగలేదు. ఫలితంగా ఇప్పుడు 2020లతోపాటు 2022ను కలుపుకొని వేతనాలను 15శాతం పెంచుతూ గెజిట్ జారీ చేశారు. త్వరలోనే నూతన వేతనాలు అమలులోకి రానున్నాయి. అదే సమయంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఎన్‌ఎంఆర్‌లకు ఇంకా 2016కు ముందు ప్రకారమే వేతనాలు చెల్లిస్తుండటం గమనార్హం. మొత్తానికి వేతనాలు పెరిగినందుకు కొందరు సంతోషపడుతుండగా.. మరికొందరు మాత్రం ఇంకా తమ బతుకులు మారనందుకు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కరీంనగర్ జిల్లాలో ఇలా?

జిల్లాలో కలెక్టర్ కాంప్లెక్స్‌తోపాటు పలు ప్రభుత్వశాఖల్లో చిరుద్యోగులుగా పనిచేసే.. నామినల్ మస్టర్ రోల్ (ఎన్‌ఎంఆర్)ల స్థితి దయనీయంగా ఉంది. నెల మొత్తం బండెడు చాకిరీ చేసినా వారికి దక్కేది కేవలం రూ.8500 మాత్రమే. అది కూడా 30రోజుల్లో ఒక్కరోజు కూడా ఆబ్సెంట్ లేకుండా ఉంటేనే. ఏ అవసరానికి సెలవుపెట్టినా వేతనంలో కోతలు తప్పవు. ఇలాంటి వారు దాదాపు కేవలం కరీంనగర్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో 30మందికి వరకు ఉన్నారు. వాస్తవానికి వీరికి కనీస వేతనాలు చెల్లించాలని 2016లో ఉమ్మడి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వెలువడిన ప్రభుత్వ అధికారిక నిబంధనలు ఇప్పటికీ అమలు కాలేదు. ఫలితంగా జిల్లాలో పనిచేస్తున్న ఎన్‌ఎంఆర్‌ల పరిస్థితి దయనీయంగా ఉంది. అడ్డా మీద కూలీల కంటే కూడా తమ వేతనాలు చాలా తక్కువగా ఉన్నాని వారంతా వాపోతున్నారు. అయితే, ఉమ్మడి కజిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేసే ఎన్‌ఎంఆర్‌లకు వేతనాలు గెజిట్ ప్రకారమే ఇస్తుండటం గమనార్హం.

15శాతం పెంచుతూ జీవో

తాత్కాలిక పద్ధతిన వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే చిరుద్యోగులుగా వీరిని రిక్రూట్ చేసుకున్నారు. వాస్తవానికి వివిధ శాఖలు వారికి అవసరమైన మేరకు రోజువారీ పద్ధతిన పనిచేసే ఎన్‌ఎంఆర్‌ల వేతనాలు చెల్లించాలి. ఈ అందరికీ చివరిసారిగా 2018 సంవత్సరంలో వేతనాలు పెరిగాయి. అనంతరం కరోనా కారణంగా ఈ పెంపుదల జరగలేదు. తాజాగా వీరి వేతనాలను 15శాతం మేరకుపెంచుతూ కలెక్టర్ కర్ణన్ గెజిట్ జారీ చేశారు. చేసే పని, ప్రావీణ్యం ఆధారంగా వీరిని అన్‌స్కిల్డ్ (చౌకీదార్, అటెండర్, స్వీపర్, మేస్త్రీ, మజ్దూర్, స్కావెంజర్ తదితరాలు) సెమీ స్కిల్డ్ (సెకండ్ క్లాస్ మేషన్, కార్పెంటర్, బ్లాక్‌స్మిత్, పెయింటర్, ఫిట్టర్, కుక్, ఎలక్ట్రిషియన్, తదితరాలు) స్కిల్డ్ (ఫస్ట్‌క్లాస్ మేషన్, మెకానిక్,ఫిట్టర్, వెల్డర్, డ్రైవర్, క్లర్క్స్, టైపిస్ట్ తదితరాలు) అనే మూడురకాలుగా వర్గీకరించారు. ఇవే ఆదేశాలు ఉమ్మడి జిల్లా పకరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు వర్తించనన్నాయని అధికారులు తెలిపారు.

ఆ 30 మందికి అమలు చేయాలి



ప్రస్తుతం కరీంనగర్ కలెక్టరేట్‌లో దాదాపు 30 మంది 15 ఏళ్లుగా ఎన్‌ఎంఆర్‌లుగా పనిచేస్తున్నారు. వీరికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. కాకుండా కేవలం రూ.8500 నామమాత్రపు వేతనాలు మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ విషయం సమాచార హక్కు చట్టం ద్వారా వెల్లడైంది కూడా. వారంతా నోరు తెరిచి అడగలేని దయనీయ స్థితిలో ఉన్నారు. ఎన్‌ఎంఆర్‌లకు తాజాగా 15శాతం వేతన సవరణను ఆహ్వానిస్తున్నాం. కానీ, వీరి విషయంలో మానవతా దృక్పథంతో అందరికీ కొత్త వేతన సవరణ ప్రకారం.. జీతాలు అందజేయాలి.

– మహమ్మద్ జమీల్, సామాజిక కార్యకర్త

కేటగిరీ	2018 ప్రకారం	వేతనాలు
నాన్ కార్పొరేషన్		కార్పొరేషన్
అన్‌స్కిల్డ్	రూ.425	రూ.531
సెమీ స్కిల్డ్	రూ.480	రూ.600
స్కిల్డ్	రూ.540	రూ.675
కేటగిరీ 2022 ప్రకారం వేతనాలు	నాన్ కార్పొరేషన్	
కార్పొరేషన్		
అన్‌స్కిల్డ్	రూ.489	రూ.611
సెమీ స్కిల్డ్	రూ.552	రూ.690
స్కిల్డ్	రూ.621	రూ.776

(నోట్: ఈ పెంపుదల 2019–2020, 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాలకు వర్తిస్తుంది..)



క్లుప్తంగా

జీపీలకు జిల్లాస్థాయిలో అవార్డులు


అవార్డు అందుకుంటున్న సర్పంచ్ వంశీకృష్ణరావు

కోనరావుపేట: మండలంలోని గ్రామాలు జిల్లాస్థాయిలో అవార్డులు సాధించినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన జాతీయస్థాయి దీన్‌దయాళ్ పురస్కార్ అవార్డు కార్యక్రమంలో మండలంలోని మూడు గ్రామాలకు అవార్డులు వచ్చాయన్నారు. ఎగ్లాస్‌పూర్ (పరిపాలన విభాగంలో) గ్రామానికి, నాగారం (ఆరోగ్య పంచాయతీ), మర్తనపేట (సామాజిక భద్రత) విభాగంలో అవార్డులు వచ్చినట్లు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయాగ్రామాల సర్పంచులు దండు ఎల్లవ్వ, బాస లావణ్య, వెన్నమనేని వంశీకృష్ణరావు అవార్డులను అందుకున్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, ఎంపీవో రాజు, కార్యదర్శులు రజిత, అఫ్సానా, రవి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ముస్తాబాద్: శోభకృత్ నూతన సంవత్సర తెలుగు క్యాలెండర్‌ను మార్కండేయ సేవాసంఘం ఆధ్వర్యంలో ముస్తాబాద్‌లో సోమవారం ఆవిష్కరించారు. తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలను తెలిపేలా క్యాలెండర్‌ను రూపొందించినట్లు సేవాసంఘం బాధ్యులు తెలిపారు. సంఘం అధ్యక్షుడు గూడూరి రాజమల్లయ్య, చిలివేరి ధర్మయ్య, మ్యాన మల్లేశ్, ఉపాధ్యక్షుడు పాశికంటి నాగులు, మాదాసు యాదగిరి, కొంక రాజు, యాడారపు రాజు, నర్సింలు, పాశికంటి సత్యానారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మట్టిని తరలిస్తున్న వాహనాల సీజ్..


వాహనాలను పట్టుకున్న సీఐ వెంకటేశ్

వేములవాడ అర్బన్: వేములవాడ మండలం.. అనుపురం గ్రామ శివారులో ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తున్న లారీ, ట్రాక్టర్, జేసీబీని పట్టుకొని సీజ్ చేసినట్లు వేములవాడ టౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మట్టి, ఇసుకను అక్రమంగా తరలిస్తే వాహనాలు సీజ్ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

పీఎఫ్‌పై ప్రత్యేక కార్యక్రమం

వేములవాడ : పీఎఫ్ నోడల్ ఆఫీసర్ ఆడెపు రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఉపయోగం, ప్రయోజనాలు, లాభాలు తెలియజేసేందుకు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, మున్సిపల్ ఉద్యోగులు, బీడీ కార్మికులు, మున్సిపల్ లీడర్లు, పింఛన్‌దారులు, పీఎస్ సంస్థ ప్రతినిధులు సక శ్రీనివాస్, గూడూరి అనిల్‌కుమార్, ట్రస్మా ప్రతినిధులు నరాల దేవేందర్, శ్రీసన్నిధి వెంకటకృష్ణ, నరాల సంతోష్ పాల్గొన్నారు.

అత్యాశకు పోతే అంతే..

- పెట్రేగుతున్న సైబర్ నేరగాళ్లు
- లబోదిబోమంటున్న బాధితులు
- నేరాలను నియంత్రించే పనిలో ఖాకీలు

“ ‘సిరిసిల్ల పట్టణానికి చెందిన ఓ యువతి తన కంప్యూటర్‌లోని ఓ వెబ్‌సైట్ లింకును ఓపెన్ చేసింది. దానికి బదులుగా ఆ లింకులో రూ.100 రివార్డు వచ్చింది. ఇలాంటి రివార్డులు ఇంకా చాలా వస్తాయన్న సమాచారం రాగానే పలుదఫాలుగా గరిష్టంగా రూ.1.50 లక్షల పెట్టుబడి పెట్టిన తర్వాత రివార్డ్‌ను తీసుకోవడానికి వెబ్ లింకును వెతికితే కనబడలేదు. తాను మోసపోయానని ఫిర్యాదు చేయడంతో సిరిసిల్ల టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.’

‘కోనరావుపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరికి తమ దగ్గరి బంధువు పేరిట సామాజిక మాధ్యమంలో మెస్సేజ్ వచ్చింది. అత్యవసరంగా డబ్బు కావాలని, తన అకౌంట్ పని చేయడం లేదని, ఇంకో నంబర్‌కు ట్రాన్స్‌ఫర్ చేయాలని మెస్సేజ్ వచ్చింది. ఇది నమ్మిన సదరు వ్యక్తులు రూ.10వేల చొప్పున నగదు బదిలీ చేశారు. వెంటనే మరో రూ.10 వేలు అదనంగా కావాలని అడగడంతో సదరు వ్యక్తులకు అనుమానం వచ్చి దగ్గరి బంధువుకు ఫోన్ చేయగా, మెస్సేజ్ పంపింది ఎవరో తనకు తెలియదని చెప్పాడు. దీంతో తమను ఎవరో మోసం చేసినట్లు గమనించి పోలీసులను ఆశ్రయించారు.’ ”



సిరిసిల్లక్రైం: ఒకప్పుడు ఇంట్లో దొంగలు పడ్డారని, అందినకాడికి దోచుకెళ్లారనే మాటలు వినబడితే.. ఇప్పుడు సైబర్ దొంగలు కనిపించకుండా కాసులు లాగేస్తున్న మాటలు వినాల్సి వస్తోంది. సమాచారం కోసం సాఫ్ట్‌గా మాట్లాడి సైబర్ నేరగాళ్లు ఆర్థికంగా మోసం చేస్తున్నారు. వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు పదేపదే సూచనలు చేస్తున్నా.. పెడచెవిన పెట్టినవారు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి న్యాయం చేయాలని ఠాణా మెట్లెక్కుతున్నారు.

ప్రజల అత్యాశే పెట్టుబడిగా..

సైబర్ నేరగాళ్లు ప్రజల అత్యాశ, భయం రెండింటితోనే మోసాలకు పాల్పడుతున్నారు. కొంత డబ్బు పెట్టుబడి పెడితే ఎక్కువ సొమ్ము వస్తుందన్న సమాచారాన్ని ఇచ్చి మోసం చేయడం ఒక పద్ధతి. సామాజిక మాధ్యమాల్లో చాటింగ్, వీడియో కాల్స్ చేసి అందులో ఉన్న వ్యక్తుల ఫొటోలు మార్ఫింగ్ చేసి కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసి డబ్బులు దండుకోవడం రెండో పద్ధతి. అంతేకాక ఏదైనా వ్యక్తికి సంబంధించి బ్యాంకు అకౌంట్, పాన్‌కార్డు, ఇతర అకౌంట్లు బ్లాక్ అవుతుందని సాయం చేసినట్లు నటించి వారి వ్యక్తిగత సమాచారం తీసుకొని నేరాలకు పాల్పడుతున్నారు. ఏదేని సైబర్ నేరం జరిగితే వెంటనే 1930కి కాల్ చేస్తే పోగొట్టుకున్న డబ్బు తిరిగి పొందేందుకు అవకాశాలున్నాయి. తక్షణ సాయం కోసం డయల్ 100కి కాల్ చేయాలని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో ఇటీవల నమోదైన నేరాలు

- గంభీరావుపేట్ ఠాణా పరిధిలో ఓ వ్యక్తి వాట్సప్‌నకు ఒక నంబర్ నుంచి అశ్లీలత సమాచారం వచ్చింది. దీంతో అతడు ఆకర్షణకు గురై వీడియో కాల్ చేయగా, రికార్డ్ చేసి యూ ట్యూబ్‌లో పెడతామని బెదిరించడంతో బాధితుడు రూ.24,500 ఆన్‌లైన్‌లో బదిలీ చేశాడు.
- వీర్నపల్లి స్టేషన్ పరిధిలో బాధితుడికి ఎస్బీఐ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని కాల్ రా వడంతో అతడి సమాచారం సేకరించిన దుండగులు ఖాతా నుంచి రూ.45,900 కొట్టేశారు.
- ముస్తాబాద్ పరిధిలో వ్యక్తికి బజాజ్ ఫైనాన్స్ పర్సనల్ లోన్ అని ఫేక్ కాల్ రాగా, రూ.35,000 పోగొట్టుకున్నాడు.

అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరగాళ్లు ప్రజలను వివిధ రూపాల్లో మోసాలు చేస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పించడమే ప్రథమ మార్గంగా ఎన్నుకున్నాం. బాధితులకు న్యాయం చేయడానికి వీలైనంత వరకు సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తుతో ముందుకెళ్తున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

పిచ్చి కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు



గాయపడ్డ చరణ్ తేజ్, వీపుపై కుక్క కాట్లు


చికిత్స పొందుతున్న మంజుల

బోయినపల్లి (చొప్పదండి): మండలంలోని బూర్గుపల్లి, బోయినపల్లి గ్రామాల్లో సోమవారం పిచ్చికుక్కల దాడిలో ఇద్దరు మహిళలతో పాటు ఓ బాలుడు గాయపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్గుపల్లి గ్రామానికి చెందిన కొలుపుల మంజుల (40) ఉదయం ఇంటి ముందు నిల్చుండగా ఆమెపై పిచ్చికుక్క దాడిచేసింది. కాగా చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బోయినపల్లిలో ఓ ఇంట్లో జరిగిన శుభకార్యానికి పలువురు బంధువులు హాజరయ్యారు. సోమవారం తిరుగుపయనమవుతుండగా భీవండికి చెందిన కుసుమ లక్ష్మి (50), కరీంనగర్ జిల్లా ఎలగందుల గ్రామానికి చెందిన చరణ్ తేజ్ (5)పై పిచ్చికుక్కలు దాడిచేయగా వారికి తీవ్ర గాయాలయ్యాయి. వారికి బోయినపల్లి పీహెచ్‌సీలో చికిత్స అందించారు. గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

సిరిసిల్లలో..

సిరిసిల్ల టౌన్: సిరిసిల్లలో పిచ్చికుక్క దాడిచేయగా ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానిక ఇందిరానగర్‌లో వాకింగ్‌కు వెళ్లిన మేర్గు రాజేశంతో పాటు మరో ఇద్దరిపై దాడిచేయగా వారికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పట్టణంలో కుక్కల బెడదపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి


మిట్టపల్లి లక్ష్మణ్ (ఫైల్)

మల్లాపూర్ : కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి యత్నించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మల్లాపూర్ మండలం మొగిలిపేటలో గ్రామానికి చెందిన మిట్టపల్లి లక్ష్మణ్ (35)కు ఏడు సంవత్సరాల క్రితం చిట్టాపూర్‌కు చెందిన కావ్యతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు ఉన్నాడు. నెల క్రితం భార్యతో మనస్పర్థలు రావడంతో కుమారుడిని తీసుకొని పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మణ్ ఈనెల 24న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు లక్ష్మణ్‌ను నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి తల్లి విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తనిఖీ

జగిత్యాల టౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఓ మహిళ కత్తితో వచ్చిందనే సమాచారంతో పోలీసులు ఆమెను తనిఖీ చేశారు. కార్యాలయం ఎదుట ఆమె బ్యాగును తనిఖీ చేయగా ఎలాంటి ఆయుధం లభించలేదు. ఆమెను విచారించగా మతిస్థిమితం కోల్పోయినట్లు గుర్తించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన టిప్పర్

- హనుమాన్ దీక్షాపరుడి మృతి
- మృతదేహంతో బంధువులు, కుటుంబ సభ్యుల ధర్నా


గడ్డం గంగారెడ్డి (ఫైల్)

చందుర్తి (వేములవాడ) : టిప్పర్ ఢీకొన్న ఘటనలో హనుమాన్ దీక్షాపరుడు మృతిచెందిన సంఘటన చందుర్తి మండలం కట్టలింగంపేట–లింగంపేట గ్రామాల మధ్య సోమవారం చోటు చేసుకుంది. మృతుడి బంధువుల తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం.. తండ్రాయాల గ్రామానికి చెందిన గడ్డం గంగారెడ్డి (70) హనుమాన్ మాల ధరించాడు. వేములవాడలో రాజన్నను దర్శించుకొని తిరిగి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా చందుర్తి మండలం కట్టలింగంపేట–లింగంపేట గ్రామాల మధ్య వెనుక నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొంది. దీంతో గంగారెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు డ్రైవర్‌ను పట్టుకునేందుకు యత్నించగా పారిపోయాడు.


ప్రమాదానికి కారణమైన టిప్పర్

మృతదేహంతో ఆందోళన...

రోడ్డు ప్రమాదంలో గంగారెడ్డి మృతిచెందిన విషయం తెలుసుకున్న బంధువులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహంతో ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తామన్నారు. రెండు గంటలకు పైగా ఆందోళన చేపట్టగా వేములవాడ రూరల్ సీఐ బన్సీలాల్, ఎస్సైలు రమాకాంత్, నాగరాజు, ప్రభాకర్ ఆందోళనకారులను అరెస్టు చేశారు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య రాజగంగు, ఐదుగురు కూతుళ్లు ఉన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు తప్పిన ప్రమాదం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): జిల్లెల్ల గ్రామంలో మంత్రి పర్యటన ముగించుకుని సిరిసిల్లకు తిరుగు పయణం అయిన జెడ్పీ చైర్‌పర్సన్ అరుణకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. బద్దెనపల్లికి చేరుకోగానే చైర్‌పర్సన్ కారును ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తాపడగా కారుకు కొద్దిగా పాడైంది. ఆటో డ్రైవర్ తాగిన మైకంలో వాహనం నడపడం మూలంగానే ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ కావడంతో వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి క్రమబద్ధీకరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ క్షేమంగా ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు.

మొర ఆలకించండి.. సమస్యలు పరిష్కరించండి

- ప్రజావాణికి వినతుల వెల్లువ
- ఫిర్యాదులు స్వీకరించిన అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు మొరపెట్టుకున్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను పరిష్కరిచాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 28 దరఖాస్తులు రాగ, ఇందులో రెవెన్యూ 14, మున్సిపల్, ఎంపీడీవో తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, డీపీవో, డీఆర్డీవో, డీఎంహెచ్‌వో తదితర సమస్యలపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి, వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్రమ పట్టా చేసుకున్నారు



ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ గ్రామ శివారులో సర్వే నంబర్లు 150,435,275లో మొత్తం 21 గుంటల భూమి మా తండ్రి ఎగుర్ల లస్మయ్య నుంచి వారసత్వంగా వచ్చింది. గత 55 ఏండ్ల నుంచి ఇప్పటి వరకు సాగు చేసుకుంటున్నా. నాకు రావాల్సిన భూమిని రెవెన్యూ అధికారులు వేరే వారి పేర్లపై మార్పిడి చేశారు. ధరణిలో నాపేరు రాకుండా చేశారు. ఈ విషయం గురించి పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. అధికారులు మోకాను పరిశీలించి అక్రమ పట్టా చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

– ఎగుర్ల బీరయ్య

పూర్తి హక్కులు కల్పించాలి


వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

చందుర్తి మండలం కొత్తపేట గ్రామ శివారులో తీగలకుంట చెరువుకు సబంధించి పూర్తి హక్కులు మా గ్రామానికే కల్పించాలి. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం, చందుర్తి మండలాల సరిహద్దుల మధ్య ఈ చెరువు ఉంటుంది. జగిత్యాల జిల్లా ఇరిగేషన్ శాఖ నుంచి సిరిసిల్ల జిల్లా ఇరిగేషన్ శాఖకు మార్పిడి చేసి చెరువుకు సంబంధించి పూర్తి హక్కులు కల్పించాలి.

రోడ్డు ప్రమాదంలో అంగన్‌వాడీ టీచర్ మృతి

- మేడిపల్లి జాతీయ రహదారి వద్ద ఘటన


మంగ అలియాస్ వసుంధర (ఫైల్)

ఇబ్రహీంపట్నం : రోడ్డు ప్రమాదంలో అంగన్‌వాడీ టీచర్ మృతిచెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తక్కపెల్లి గ్రామానికి చెందిన కొడిమ్యాల మంగ అలియాస్ వసుంధర ఢిల్లీలో ఈనెల 28న పార్లమెంట్, జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో పాల్గొనేందుకు తోటి అంగన్‌వాడీ టీచర్లతో వెళ్లేందుకు సిద్ధమైంది. కుమారుడు తేజతో కలిసి తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై మెట్‌పల్లికి వెళ్తుండగా మేడిపల్లి వద్ద రోడ్డుపై మృతిచెందిన గేదెను ఢీకొన్నారు. వసుంధర అక్కడికక్కడే మృతిచెందింది. తేజకు గాయాలయ్యాయి. మృతురాలికి ముగ్గురు కుమారులు కాగా భర్త వేణు బతుకుదెరువు కోసం సౌదీకి వెళ్లాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై ఉమాసాగర్ పరిశీలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటంబాన్ని ఆదుకోవాలి..

మెట్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అంగన్‌వాడీ టీచర్ మంగ కుటుంబాన్ని ఆదుకోవాలని ఏ ఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు కోరారు. ప్రభుత్వం రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు.

విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఏడాది జైలు

జగిత్యాలజోన్ : విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తికి ఏడాది జైలుతో పాటు రూ.3 వేల జరిమానా విధిస్తూ జిల్లా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు జడ్జి, జిల్లా మొదటి అదనపు జడ్జి వీరయ్య సోమవారం తీర్పుచెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముదుగంటి బాలత్రిపుర సుందరి కథనం ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన 17 ఏళ్ల విద్యార్థిని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. డిసెంబర్ 12, 2016న కళాశాలలో పరీక్ష ఉండగా హాజరైంది. రాత్రి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా మార్గమధ్యంలో అర్ముల్ల రాజేశ్ అనే వ్యక్తికి చెందిన ఆటో కనిపించగా తెలిసిన వ్యక్తి అని ఆటో ఎక్కింది. కొంతదూరం వెళ్లాక విద్యార్థిని పట్ల ఆటోడ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించగా ఆటోలో నుంచి దూకింది. దీంతో తీవ్రగాయాలుకాగా జగిత్యాల టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేయడంతో ప్రస్తుత డీసీపీ, అప్పటి సీఐ పి. కరుణాకర్ రాజేశ్‌ను అరెస్ట్ చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు బి.రాజు, జి. మల్లేశ్, కిరణ్‌కుమార్ సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టారు. అనంతరం రాజేశ్‌కు ఏడాది జైలుతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

వసతులు నిల్..

- అభివృద్ధికి నోచుకోని ఆగ్రహారం అంజన్న ఆలయం..
- ఇబ్బందులు పడుతున్న భక్తులు
- సౌకర్యాలు కల్పించాలని డిమాండ్


అగ్రహారం అంజన్న ఆలయం

వేములవాడ అర్బన్: కోరిన కోర్కెలు తీర్చుతూ..కొంగు బంగారంగా కొలిచే ఆగ్రహారం ఆంజనేయ స్వామి ఆలయంలో మౌలిక వసతులు కరువయ్యాయి. వేములవాడ – సిరిసిల్ల రహదారిని ఆనుకొని ఆలయం ఉంది. ఈ ప్రాంతాల ప్రజలు కొత్త వాహనాలు కొనుగోలు చేస్తే ఆలయంలో వాహనపూజ చేయిస్తారు. వాహన పూజల ద్వారానే ఆలయానికి ఎక్కువశాతం ఆదాయం సమకూరుతుంది. కానీ భక్తులకు వసతులు కల్పించకపోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ప్రహరీ లేక ఇబ్బందులు

హనుమాన్ ఆలయం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పందులు, కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రహదారికి దగ్గరగా ఆలయం ఉండగా వాహనాలు ఆలయం ముందు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ నిర్మాణంతోపాటు ఆవరణలో మొక్కలు నాటితే భక్తులకు ఆహ్లాదకరంగా ఉండనుంది.

ఈ వసతులు కల్పించాలి

- అంజన్న ఆలయ ఆవరణ బయట చుట్టు ప్రహరీ నిర్మించాలి.
- వాహనాల పూజకోసం ఆలయం ముందు రేకుల షెడ్డు వేయాలి..
- శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంక్‌ను కూల్చివేసి కొత్త ట్యాంక్ ఏర్పాటు చేయాలి..
- ఆలయ ఆవరణ, బయట సీసీరోడ్డు నిర్మించాలి.
- భక్తుల కోసం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి.
- ఆలయం ముందు రోడ్డును ఆనుకొని శిథిలావస్థలో ఉన్న గదులను తొలగించాలి..
- భక్తులకు ఏర్పాటు చేసిన గదుల వద్ద బోర్డులు ఏర్పాటు చేసి, రోజువారీగా అద్దెకు ఇస్తే ఆలయానికి ఆదాయం సమకూరే అవకాశముంటుంది.

ఇబ్బంది లేకుండా చూస్తాం.

ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. అన్ని వసతులు కల్పిస్తాం. వాటర్‌ట్యాంక్ ఏర్పాటుతో పాటు మరిన్ని పనులు ప్రారంభించాం. త్వరలోనే పూర్తిచేసి అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

– మారుతి, ఆలయ ఈవో

ఆస్తిపన్నులో తప్పులపై కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టరేట్ వద్ద పౌర సంక్షేమ సమితి బాధ్యులు

సిరిసిల్లటౌన్: మున్సిపల్ అధికారుల నిర్లిప్తతతో ఆస్తిపన్నుల విధింపులో అనేక తప్పులు దొర్లాయని పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ ఆరోపించారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసి మాట్లాడారు. అధికారులు చేసిన తప్పులకు ఇంటి యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆస్తిపన్నులో తప్పులు దొర్లడానికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట సమితి ప్రతినిధులు, బాధితులు ఉన్నారు.

కంటి వెలుగులో 3,358 మందికి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలోని 23 ప్రాంతాల్లో సోమవారం కంటి వెలుగు శిబిరాలు నిర్వహించారు. డాక్టర్లు 3,358 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 686 మందికి రీడింగ్ అద్దాలు, 567 మందికి పాయింట్ అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో 44 రోజులుగా శిబిరాలు నిర్వహిస్తుండగా, ఇప్పటి వరకు 1,65,934 మందికి కంటి పరీక్షలు చేశారు.